# ఇయం గేహే లక్ష్మీ...

కలువకొలను ఇందుమౌళి

**పెళ్లిళ్ల సీజను. ఆఫీసులో కొత్తగా పెళ్లయినవాళ్లంతా హనీమూన్ కోసమని ఢిల్లీ, సిమ్లా, డార్జిలింగ్‌లాంటి ప్రదేశాలకు వెళ్లి వస్తున్నారు. నాలుగేళ్లకొకసారి ఒక నెల సెలవులు అమ్ముకుని, ఎల్టీసీ మీద దేశమంతా తిరిగి వచ్చే అవకాశం ఉంది కాబట్టి, ఎల్టీసీ ట్రిప్‌ను హనీమూన్ ట్రిప్‌గా మార్చుకుని వెళ్లిపోతారు నూతన వధూవరులు. ఖర్చులకెలాగూ కట్న కానుకలూ, లాంఛనాలు ఉంటాయి కాబట్టి!**

ఆఫీసు కాంటీన్‌లో కూర్చుని శేఖర్ కాఫీ తాగుతున్నాడు. కాఫీ పూర్తవుతుండగా మూర్తి వచ్చాడు. వారం రోజుల క్రితమే హనీమూన్ వెళ్లి వచ్చాడు. ఫొటోలు చూపించాడు. ఒక్కొక్కటిగా తీసి చూశాడు శేఖర్. తెల్లని మంచుకొండల్లో మూర్తి, అతని పెళ్లాం రకరకాల పోజుల్లో ఉన్నారు. ఒక్కో ఫొటోలో ఒక్కో సుందరమైన దృశ్యం. తాజ్‌మహల్ ఎదురుగా ఉన్న బెంచీమీద వీపువీపు ఆనించుకుని ఎడమొగం, పెడమొగంగా తీయించుకున్న ఫొటో చాలా బాగుంది. ఇంకో ఫొటోలో తాజ్‌మహల్‌ను



చేత్తో పట్టుకున్నట్లు భ్రాంతి కలిగేలా చక్కగా తీశారు. జైపూర్‌లోని రాజ ప్రాసాదాలు బహురమ్యంగా ఉన్నాయి. అన్నీ చూడడం పూర్తయింది.

"అన్నీ చూసి రావడానికి ఎంత ఖర్చయింది, మూర్తీ!"

"ఆఫీసు వాళ్ల ఇచ్చింది కాకుండా మరో నాలుగైదువేలు దాకా అయ్యాయి. చాలా లిమిట్‌గా వాడుకుంటే ఆమాత్రం ఖర్చయింది!" అని ఫొటోలు తీసుకుని ఇంకొకరికి చూపించడానికి వెళ్లిపోయాడు మూర్తి. అదో ఆనందం.

శేఖర్ ఆలోచిస్తున్నాడు.

అందరూ పెళ్లిళ్ల చేసుకుని సరదాగా గడిపిరావడానికి దూరతీరాలకు వెళ్లివస్తున్నారు. ఉష అంటే తనకు ప్రాణం. ప్రేమించిన ఉషతో, పెళ్లయ్యాక ఎంచక్కా కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకూ వెళ్లిరావాలి. జాలీగా ఎంజాయ్ చేయాలి. ఉషను బాగా సుఖపెట్టాలి అనుకున్నాడు.

కొంతకాలం గడిచింది.

ఉష - శేఖర్‌ల పెళ్లికి అంగీకరించకుండా వాళ్ల తల్లిదండ్రులు కులమనే అడ్డుగోడలు కట్టారు. ససేమిరా వీలుపడదన్నారు.

ఉషకు అన్యాయం చేయలేని శేఖర్, ఆమెను రిజిస్టర్ మేరేజ్ చేసుకుని,





సౌదామిని
పద్మ
నీహారిక
సుందరి
ప్రియ

- అయిదుగురు మహిళల జీవన గమనంలో ఎదురైన విచిత్రానుభవాల కథనం

చంద్రశేఖర్ మల్లాది
సీరియల్
'మంచుతెరలు'
త్వరలో

1995 దీపావళి నవలల పోటీలో ఎంపికైన సాధారణ ప్రచురణ నవల!

మర్నాడు ఆఫీసులో చిన్న సైజు రిసెప్షన్ కూడా ఇచ్చేశాడు. రెండు రోజులు సెలవు పెట్టాడు.

చిన్న గదిలాంటి ఇల్లు అద్దెకు తీసుకున్నారు. ఆ రాత్రి మొదటిరాత్రి. పాలగ్లాసు చేతికందించి, లోపలికి నెట్టి తలుపులేసేవాళ్ళ ఎవరూ లేరు. మంచాలూ, పట్టు పానుపులూ లేవు. మల్లెమాలలూ, మామిడి తోరణాలూ లేవు. ఓ చాప పరుచుకుని ఇద్దరూ ఒద్దికగా కూర్చుని ఉన్నారు.

శేఖర్ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

ఒకప్పుడు అందరిలాగా తనూ పెళ్లయిన తర్వాత కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు తిరగాలనుకున్నాడు. కానీ ఇప్పుడు విధి ఇలా వక్రించింది. డబ్బులు కూడబెట్టుకోలేదు. నెలనెలా ఇంటికి పంపిచేసేవాడు. ఇప్పుడు హనీమూన్ వెళ్లాలంటే చార్జీలకు ఆఫీసు ఇస్తుందనుకున్నా, ఖర్చులకు నాలుగైదు వేలన్నా కావాలి. ఇంటికి సంబంధించిన చిన్న చిన్న వస్తువులు కొనుక్కోవాలి.

"ఏమిటండీ? అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?"

ఉలిక్కిపడ్డాడు శేఖర్. మనసులోని మాట చెప్పాడు. శేఖర్‌కు ధైర్యం చెప్పింది ఉష.

"ఏమండీ! కాశ్మీరులూ, కన్యాకుమారులూ వెళితేనే హనీమూన్‌కెళ్లినట్లనుకుంటే ఎలాగండీ! నేను కన్యాకుమారిని, మీరు కాశ్మీరనుకుంటే ఎంచక్కా ఇక్కడే ఇద్దరమూ సుందరమైన ప్రదేశాలు చూస్తూ ఆనందలోకాల్లో విహరించవచ్చు. మీరేమీ బాధ పడకండి. తాజ్‌మహల్ చూడాలంటే ఆగ్రా వెళ్లాలా? మనమున్నదే తాజ్‌మహల్ కదండీ!" చెప్తూ ఉంటే ఆవిడ కంటి చివర్న నిలిచిన కన్నీటి చుక్కలను గమనించాడు శేఖర్.

చెప్పుకుపోతోంది ఉష.

"నేనూ చదువుకున్నదాన్నేగా! ఎక్కడో ఒకచోట - ఇంటి బాడుగకైనా సరిపోయే చిన్న ఉద్యోగం దొరక్కుండా పోదు. అంతవరకూ ఎలాగో సర్దుకుందాము. ఎల్టీసీ వెళ్లేముందు మీరు ఒక నెల సెలవులు ఎన్‌కాష్ చేసుకోవచ్చు కదా! ఆ డబ్బుతో నిత్యావసరాలకు ఉపయోగపడే చిన్న చిన్న వస్తువులు కొనుక్కుందాం. ఎక్కడికో ఒకచోటికి వెళ్లాలి కాబట్టి, ఆఫీసు డబ్బుల్తో కొండపైకి వెళ్లి వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఓ రోజు గడిపి వస్తాము. మనకు శుభాలు జరుగుతాయి. నన్ను ఎక్కడికీ తీసుకెళ్లలేదని మీరలా బాధపడితే నాకెలా ఉంటుంది చెప్పండి?" అంది కంటి తడిని తుడుచుకుంటూ.

శేఖర్‌కు భార్య మాటలు మంచి ఓదార్పునిచ్చాయి.

"ఉషా! ఎంత మంచిదానివోయ్ నువ్వు! అందరి పెళ్లాలూ మొగుళ్లను 'అక్కడికి తీసుకెళ్లలేదు, ఇక్కడికి తీసుకెళ్లలేదు' అని రాచిరంపాన పెడుతుంటే, నువ్వు మాత్రం నన్ను ఓదార్చి, ధైర్యం చెప్పి మంచి సలహానిచ్చావు. ఇలా భర్త కష్టాలను అర్థం చేసుకుని సహకరించే భార్యలు దొరకాలంటే ఎంతో అదృష్టం చేసుకోవాలి!" అంటూ దగ్గరకు లాక్కుని నుదుటిపై ముద్దుపెట్టుకున్నాడు.

పక్కింట్లోంచి సన్నగా రేడియోలో పాట వినిపిస్తోంది -

"ప్రేమ యాత్రలకు బృందావనమూ, కాశ్మీరాలు ఏలనో?
అన్యోన్యంగా దంపతులుంటే భువికి స్వర్గమే దిగిరాదా!"

ఆ రాత్రి శేఖర్ ఒడిలో ఒదిగి పూర్తిగా కరిగిపోయింది ఉష.